సాక్షి


గుంటూరు

శనివారం : 20 : ఏప్రిల్ : 2024



నేడు దోకిపర్రులో ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: దోకిపర్రులోని రుక్మిణీ సత్య భామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించనున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 507.90 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,496 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరభ్‌శర్మ శుక్రవారం దర్శిం చుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

చందోలులో ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్ర మాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం మగ పిల్లలకు వివాహ దోషాలు తొలగి శ్రీఘ్రంగా వివాహం జరగడానికి గానూ ప్రత్యేకంగా హరిద్ర శృంగా ర్చనను పసుపు కొమ్ములతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండ్లమ్మ వారిని మహా గౌరీ దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శిం చుకుని పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా ఊయల సేవ



తెనాలి అర్బన్: శ్రీ క్రోధి నామ సంవత్సర చైత్ర మాస ఏకాదశి సందర్భంగా బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవ స్థానం ప్రాంగణంలోని శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామికి అర్చకులు రొంపిచర్ల చక్రవర్తి శుక్రవారం ప్రత్యేక పూజలు, ఉయ్యాల సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామికి అర్చన, అనంతరం సంకీర్తన కార్యక్ర మాలు జరిపారు. కార్యక్రమాల్లో ఉభయదా తలు అందె బాలచంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, కొండపి వసుంధర పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం పోరాడిన గౌతు లచ్చన్న



సత్తెనపల్లి: ప్రజల సంక్షేమం కోసం అహర్ని శలూ పోరాడిన కారణజన్ముడు సర్దార్ గౌతు లచ్చన్న అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా పట్టణం లోని వడ్డవల్లి పోలేరమ్మ తల్లి గుడి వద్ద బీసీ సంఘ నాయకుడు ఉప్పాల విజయ్ ఆధ్వర్యం లో శుక్రవారం గౌతు లచ్చన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బీసీ సంఘ నాయ కులు మాట్లాడుతూ దేశంలో సర్దార్ అనే బిరుదు వల్లభాయ్ పటేల్, గౌతు లచ్చన్నకు మాత్రమే ఉందన్నారు. ఆయన ఆశయ సాధ నకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తుళ్లూరు నరసింహారావు, కంటూ వెంకట్రా మయ్య, కొమర పాపారావు, పత్తిపాటి హరేకృ ష్ణ, జల్లెడ రాములు, పిక్కల శివ, ఉప్పాల గోవిందమ్మ, చింకా అంకమ్మరావు, తుళ్లూరి బాల చెన్నయ్య, ఆరేపల్లి పెద్దబాబు, తుళ్లూరి రమేష్ బాబు, బి కమలాకర్, షేక్ చిన్న షరీఫ్, కొమర నరసింహారావు, తుళ్లూరి అర్జున్‌రావు, బైలడుగు కృష్ణంరాజు, మల్లాల గురవయ్య, చింతపల్లి లాజర్, కె.దస్తగిరి, గుంటూరు గోవిందు, గొట్టం వెంకటేష్, చావల వెంకటే శ్వర్లు తదితరులు ఉన్నారు.

యార్డులో 77,908 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 67,994 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 77,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నం బర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,032 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4800, గరిష్ట ధర రూ.6500, మోడల్ ధర రూ.5700 వరకు పలికింది.

అట్టహాసం.. కోలాహలం

- వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి కిలారి నామినేషన్ దాఖలు
- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు



గుంటూరులో నామినేషన్ కార్యక్రమానికి హాజరైన జనసందోహం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య నామినే షన్ దాఖలు కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కృష్ణనగర్‌లోని తన నివాసం నుంచి కిలారి బయలుదేరి పట్టాభిపురం ఓవర్‌బ్రిడ్జి మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకు న్నారు. రోశయ్య వెంట శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, తెనాలి, పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థులు అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, వంగవీటి నరేంద్రలు ఉన్నారు. తీన్‌మార్ డప్పులు, కేరళ సంప్రదాయ డప్పులు, జానపద నృత్యం, గీతాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. రోశయ్య నామినేషన్ పత్రాలను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రె డ్డికి అందజేశారు. నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ మీదుగా తిరిగి పట్టాభిపురంలోని స్వామి థియేటర్ వరకు ప్రదర్శనగా వచ్చారు. భారీ గజమాలలతో స్వాగతం పలికి పార్టీ నేతలు, కార్యకర్తలు వారి అభిమానాన్ని చాటుకున్నారు.



అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి కిలారి, పక్కన ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ ఏసురత్నం, అంబటి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా...

గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ గడ్డపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురు వేస్తామ న్నారు. కనీసం స్థానిక సమస్యలు కూడా తెలియని వ్యక్తులను టీడీపీ తమ అభ్యర్థులుగా పోటీలో నిలి పిందని విమర్శించారు. గత పదేళ్లలో టీడీపీ ఎం పీని చూసిన పాపాన పోలేదని, ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థిని చూడాలంటే వీసా, పాస్‌పోర్ట్ తీసుకుని అమెరికా వెళ్లాలని ఎద్దేవా చేశారు. గుం టూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే సత్తా తనకుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ అభ్యర్థిగా తనని ఆశీర్వదించాలని కోరారు.

సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంక టేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చరిత్రలో ఏ ఒక్క ముఖ్యమంత్రి తీసుకు రాలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల పాత్ర ఎంతో కీలక మన్నారు. ప్రజలకు సేవ చేయటమే పరమా ధిగా ముందుకు సాగుతున్న జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. గుం టూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కిలారి రోశయ్య, ఏడు నియోజకవర్గాల అసెం బ్లీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిం చాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి స్థాపించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లా డుతూ పూర్తిస్థాయిలో అభ్యర్థుల ఎంపికలో సీఎం అన్ని కోణాల్లో ఆలోచించే నిర్ణయం తీసుకుంటార ని, రోశయ్యకు ఇవ్వటం ద్వారా గెలుపు తథ్యమని భావించే ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జికి సంబం ధించి పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వంలో చర్చించా ల్సిన పరిస్థితుల్లో.. ఏ ఒక్క రోజైనా ఎంపీ వస్తా డేమో అని చూసిన సందర్భాలు ఉన్నాయని, కనీసం ఆయన కనపడిన పాపాన పోలేదన్నారు. అందుకే పక్కా లోకల్ అయిన రోశయ్యను గెలిపిం చుకోవాలని పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజక వర్గ అభ్యర్థి అంబటి మురళీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవ్వ టం తథ్యమన్నారు. పొన్నూరులో జరిగే తన నామి నేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, జిల్లా కమిటీ నేతలు, పలు అనుబంధ విభాగాల అధ్య క్షులు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, జెడ్పీటీ సీలు, ఎంపీటీలు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఎంపీ అభ్యర్థిగా కిలారి నామినేషన్

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన వెంట సతీమణితోపాటు శాసనమండల చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటే శ్వర్లు ఉన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో రోశయ్య విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఒక ఎంపీ సీటుతోపాటు ఏడు శాస నసభ స్థానాలు వైఎస్సార్ సీపీ కైవసం చేసు కుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తమ పార్టీని విజయం వైపు తీసుకెళుతున్నార న్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు తమ విజయాలకు బాటలు వేస్తాయన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కిలారి రోశయ్య

నేడు మంత్రి విడదల రజిని నామినేషన్



పట్నంబజారు: వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ గుం టూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. చంద్రమౌళినగ ర్‌లోని ఆమె కార్యాలయం నుండి పెద్ద ఎత్తున ర్యాలీగా కొరిటెపాడు, మదర్‌థెరిస్సా విగ్రహం, లాడ్జిసెంటర్, శంకర్‌విలాస్ సెం టర్, ఓవర్‌బ్రిడ్జి, ఏసీ కళాశాల, హిందూ కళాశాల కూడలి మీదుగా కార్పొరేషన్ కార్యా లయానికి చేరుకుంటారు. ఉదయం 10గం టలకు మంత్రి కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుంది. నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్లేందుకు కార్యకర్తలు సిద్ధమవుతున్నారు.

గుంటూరు గడ్డ రుణం తీర్చుకుంటా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ అందరిపై నమ్మకంతో నన్ను ఇక్కడకు పం పారు.. ప్రతి ఒక్కరూ నాపై చూపిస్తున్న అభి మానం, అప్యాయతలు ఎనలేనివని మంత్రి విడదల రజిని చెప్పారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తమ ఇంటి బిడ్డగా పోటీ చేస్తున్న తనని ఆశీ ర్వదించాలని కోరారు. ఖచ్చితంగా గుం టూరు గడ్డ రుణం తీర్చుకుంటామన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లి తమ ఇంటి ఆడపడుచులా.. ఒక సోదరిలా ప్రతి ఒక్కరూ ఆదరాభిమా లతో తనని స్వాగతిస్తున్న తీరు ఎంతో సంతో షాన్ని.. ధైర్యాన్ని కలిగిస్తోందన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని ఇప్పటికే అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన న్నకే దక్కుతుందన్నారు. తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే... పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రా నికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలి పారు. శనివారం జరిగే తన నామినేషన్ కార్యక్రమాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం

- తూర్పు వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా నామినేషన్
- భారీ స్థాయిలో తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు



గుంటూరులో నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ప్రజానీకం

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తిరిగి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామని వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. శుక్ర వారం మంగళదాస్‌నగర్‌లోని ఎమ్మెల్యే ముస్తఫా ఇంటి నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభి మానులు వెంట రాగా ఫాతిమా నామినేషన్ దాఖలు చేసేందుకు తరలివెళ్లారు. గడ్డిపాడు, మణిపురం బ్రిడ్జి, ఎన్టీఆర్ బొమ్మ, బీఆర్ స్టేడియం , జిన్నాటవర్ మీదుగా నగరపాలక సంస్థ కార్యాల యానికి చేరుకున్నారు. నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరికి నామినేషన్ పత్రా లను తన తండ్రి, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫాతో కలసి అందజేశారు.

ఫాతిమాకు సంఘీభావం

నామినేషన్ వేసేందుకు తరలివెళుతున్న నూరి ఫాతి మాకు మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు, అభిమా నులు తరలివచ్చారు. మంగళదాస్‌నగర్ నుంచి నగర పాలక సంస్థ వరకు పాదయాత్రకు వచ్చి ఫాతిమాకు సంఘీభావం తెలియజేశారు. కాంటిపూడికి చెందిన బెల్లంకొండ మస్తానమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కోలా టం, తీన్మార్ డప్పులతోపాటు, కేరళకు చెందిన ప్రత్యేక డప్పు కళాకారులతో రోడ్లన్నీ జనజాతరను తలపించాయి. మార్గంలో మధ్యలో ఎంపీ ఆళ్ల అయో ధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబులు తమ మద్దతు తెలియజేశారు.

తూర్పు ప్రజలకు వెన్నంటే ఉంటా...

నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో నూరిఫా తిమా మాట్లాడుతూ ఎండను సైతం లెక్క చేయకుం డా వేలాది మంది ప్రజలు ర్యాలీగా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నాన్న మొహమ్మద్ ముస్తఫా పది సంవ త్సరాల కాలంలో ఎక్కడికి వెళ్లిన జనాదరణ ఉండేద ని...అదే విధంగా ఈ రోజు అదే ఆదరణ తనపై చూపడం ప్రజల అభిమానానికి ధన్యవాదాలు తెలియజేశారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగ న్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజ లంతా సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్ అడుగు జాడల్లో నడుస్తూ ప్రజాసేవే లక్ష్యంగా ప్రజలకు ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటూ, వారికి అందుబా టులో ఉంటానని మీ ఆడ బిడ్డకు నన్ను గెలిపిం చాలని కోరారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ గుంటూరు ప్రజలంతా నూరిఫాతిమాను ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశయా లకు పనిచేస్తున్న తమకు ప్రజల అండ ఎప్పుడు ఉం టుందన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు తొల గిస్తాం, చర్చిలు, మసీదులు తొలగిస్తామని కొంత మంది రాజకీయపార్టీలు వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు...ఇది మానవత్వమా అని ప్రశ్నిం చారు. కార్యక్రమంలో అంజుమాన్ అధ్యక్షులు అబ్దుల్ కర్నూమ, నరసరావుపేట అసెంబ్లీ పరిశీ లకులు గులాం రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు జీయా ఉర్ రెహ్మాన్, నసీర్, వాకా శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, వార్డు ప్రెసిడెంట్స్, కన్వీనర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అభ్యర్థి నూరిఫాతిమా, ఎంపీ అయోధ్యరామిరెడ్డి



ఆర్‌ఓ కీర్తి చేకూరికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నూరిఫాతిమా, ఎమ్మెల్యే ముస్తఫా

మంగళగిరిలో లావణ్య నామినేషన్

హాజరైన ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

మంగళగిరి : మంగళగిరిలో మరోసారి లోకేష్‌ను ఓడిస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని సీతారామ కోవెలలో స్వామి వారికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవిలు పూజలు నిర్వహించి నామినేషన్ దాఖలు చేసేందుకు బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో సీతా రామకోవెల వద్ద నుంచి మిద్దె సెం టర్, నృసింహస్వామి ఆలయం మీదుగా జన ప్రభంజనం తరలివచ్చి స్వాగతం పలికారు. మధ్యాహ్నం 11.40 నిమిషాలకు లావణ్య నామినే షన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణి, జేసీ రాజకు మారికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

లోకేష్‌ను ఓడించడం తథ్యం : ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య నామినేషన్‌కు వచ్చిన స్పంద నతో లోకేష్‌ను ఓడించడం తథ్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టం చేశారు. పార్టీ విజ యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రానున్న ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హను మంతరావు మాట్లాడుతూ మంగళగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్యను ప్రజలు ఆశీ ర్వదించి ఘన విజయాన్ని చేకూర్చాలన్నారు. వైఎ స్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య మాట్లా డుతూ గెలుపోటములు అనేది మంగళగిరి ప్రజలు నిర్ణయిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల మాట్లాడుతూ స్వయంగా వచ్చి నామినేషన్ వేయ డానికి కూడా నారా లోకేష్‌కు తీరిక లేదన్నారు.



నామినేషన్ దాఖలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య, పక్కన ఆర్కే, మురుగుడు



మంగళగిరిలో నామినేషన్ కార్యక్రమానికి హాజరైన జనసందోహం

ధూళిపాళ్ల 'పాల'నంతా అవినీతిమయం

పా'పాల' ధూళిపాళ్ల .. అవినీతి అనకొండ

- 'సాక్షి' కథనం నూటికి నూరుపాళ్లు నిజం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- 23న నామినేషన్ దాఖలు చేస్తున్నా భారీగా తరలిరండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు

పొన్నూరు: పొన్నూరులో పాతికేళ్ల టీడీపీ పాలనలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, అవినీతిలో మాత్రం ఘనత సాధించిన నేతగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చరిత్ర సృష్టించారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఆరోపిం చారు. పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో శుక్ర వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పా'పాల' ధూళిపాళ్ల ..అవి నీతి అనకొండ అంటూ మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అక్రమాలపై 'సాక్షి' ప్రచురించిన కథనంలో నూటికి నూరుపాళ్లు నిజముందని పేర్కొన్నారు. ఓట్ల కోసం తిరిగే సమయంలో ధూళిపాళ్ల తాను ఎమ్మెల్యేగా చేసిన కాలంలో చేసిన అభివృద్ధిని చెప్పు కోలేక, ఎదుటి వారిపై దుష్ప్రచారాలు చేయటం సిగ్గుచేటన్నారు. చేసిందేమైనా ఉంటే చెప్పుకుని దర్జాగా ఓట్లడగాలని, ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని నరేంద్రకు హితవు పలి కారు. సంగం డెయిరీని తన సొంత జేబు సంస్థగా మలచుకుని పాడిరైతుల కష్టాన్ని అక్రమంగా స్వాహా చేస్తున్నాడని మండిపడ్డారు. ఉచిత కంటి వైద్యశిబిరాల పేరుతో సంగం డెయిరీలో నేత్ర శిబి రాలు పెట్టి రూ.లక్షలు కాజేస్తున్నాడని ఆరోపిం చారు. పాడిరైతుల కష్టార్జితాన్ని అక్రమంగా దోచేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు.



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

ప్రజలకు మరింత సేవ చేసేందుకు వచ్చా...

రెండేళ్లుగా తన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్ర మాలు చేస్తూ ప్రజలతో మమేకమయ్యాయని వైఎ స్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీకృష్ణ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు మరింత సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, తనకు అవకాశం ఇచ్చి ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈనెల 23వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. వేల సంఖ్యలో ప్రజలు పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మున్సి పల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు, నాయకులు వడ్రాణం ప్రసాద్, బొనిగల వేణుప్రసాద్, షేక్ నాజర్, బొద్దు లూరి రంగారావు, ఎ.వెంకటేశ్వరరావు, డి.గోపి, ఎండేటి వెంకటసుబ్బయ్య, బి.నాగరాజు, వి.రం గారావు, షేక్ మాము, ఎ.సాంబశివరావు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కార్మిక శాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్

లక్ష్మీపురం : శాసన సభ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మే 13న ఎన్నికల రోజు దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సెలవు ప్రకటించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గుంటూరు జోన్ కార్మిక శాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్ శుక్రవారం తెలిపారు. పోలింగ్ జరిగే రోజు మే 13న సోమవారం దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటిచడం జరిగిందన్నారు. ఏదైనా వ్యాపారం, వాణిజ్యం పారిశ్రామిక సంస్థ, ఏదైనా ఇతర సంస్థలలో ఉద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి, శాసన సభ, లోక్ సభ ఎన్నికలలో ఓటు వేయడానికి అర్హులైన ప్రతి వ్యక్తికి పోలింగ్ రోజున సెలవు మంజు చేయాలని తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, అటువంటి వ్యక్తి వేతనాల్లో ఈ సెలవుకు ఎటువంటి తగ్గింపు చేయరాదన్నారు.యజమాని సబ్ సెక్షన్-1,2 నిబంధనలను ఉల్లంఘిస్తే యజమాని జరిమానాతో శిక్షార్హులని తెలిపారు. పోలింగ్ జరిగే నియోజక వర్గం వెలుపల పని చేసే రోజు వారీ వేతనం, సాధారణ కార్మికులు కూడా ఓటు వినియోగించుకోవడానికి అర్హులని తెలిపారు. పోలింగ్ రోజున కార్యాలయం మూసి వేయనప్పటికీ కార్మికులు సెలవు వేతనాలకు అర్హులని తెలిపారు. కార్మికశాఖ ఆదేశాలను యజమానులు అందరు పాటించి షాపులు, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎన్నికల రోజున ఓటు హక్కు వినియోగించుకునేందుకు సెలవు మంజురు చేయాలని తెలిపారు.

ప్రభుత్వోద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

నరసరావుపేట: ఏ ప్రభుత్వ ఉద్యోగి ఓటు హక్కు మిస్ అవ్వకుండా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అత్యవసర శాఖలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల విధులలో ప్రజా రవాణకు ఇబ్బంది కలగకుండా బస్సులను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారు వచ్చే నెల 5, 6, 7 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ నియోజకవర్గానికి ఎన్ని పోస్టల్ బ్యాలెట్లు వెళ్తున్నాయి, అదేవిధంగా ఇతర జిల్లాలకు వెళ్లవలసిన పోస్టల్ బ్యాలెట్ వివరాలు త్వరితగతిన నివేదికలు అందించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

లోకేష్‌కు ఓటమి భయం పట్టుకుంది

- మంగళగిరిలో హత్యారాజకీయాలకు తెరలేపుతున్నాడు
- దౌర్జన్యాలకు, అరాచకాలకు పాల్పడేలా ప్రోత్సహిస్తున్నది లోకేషే
- ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని బాధ్యులను శిక్షించాలి
- బ్రెయిన్ డెడ్ అయిన వెంకటరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే డిమాండ్


వెంకటరెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి పట్టణ 2వ సచివాలయం జేసీఎస్ కన్వీనర్‌గా పని చేస్తున్న మేకా వెంకటరెడ్డిని టీడీపీ కార్యకర్తలు ద్విచక్రవాహనంతో ఢీకొట్టి హత్యాయత్నం చేసిన ఘటనలో హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ అల్లరి మూకల దాడిలో గాయపడి మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను వారు శుక్రవారం పరామర్శించారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లి సీఎస్ఆర్ కల్యాణ మండపం రోడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ కార్యకర్తలను మేకా వెంకటరెడ్డి ప్రశ్నించారని, ఆగ్రహించిన వారు బైక్‌తో ఢీకొట్టడంతో వెంకటరెడ్డి తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఆయనను మణిపాల్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయిందని తెలిపారు. రాజకీయాలు ప్రజాస్వామ్య పద్ధతిలో చేయాలని, ఈ విధంగా దాడులు చేయడం దారుణమని అన్నారు. మంగళగిరిలో లోకేష్ రెండోసారి ఓడిపోతాననే భయంతో ఇలాంటి చర్యలకు దిగుతున్నారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఈ విషయంపై జోక్యం చేసుకుని విచారించాలని డిమాండ్ చేశారు. బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని లేదంటే తాము కూడా నిరసన ప్రదర్శనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చల శ్యామ్, మహేష్, వెంకటరామిరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వానికి న్యాయవాదులు మద్దతివ్వాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి, జీవన ప్రమాణాల మెరుగుదలకు, అటు సంక్షేమాన్ని, ఇటు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందిస్తూ రాజకీయ భాగస్వామ్యం కల్పిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు న్యాయవాదులు మద్దతు నివ్వాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజ్ఞప్తిచేశారు. స్థానిక కొత్తపేటలోని అదితి గ్రాండ్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం తెనాలి, వేమూరు నియోజకవర్గాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయవాదుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గత ఎన్నికల్లో తన విజయంలో పార్టీ న్యాయవాదులు ఎంతో అండగా ఉండి కృషి చేసినట్టు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ మరోసారి ఎమ్మెల్యేగా తనను, గుంటూరు ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను గెలిపించేందుకు పని చేయాలని కోరారు. కేవలం ఎన్నికల్లో మాత్రమే ఇక్కడకొచ్చి ప్రజలను మభ్యపెట్టే వారితో జాగ్రత్తగా ఉండాలని ప్రతిపక్ష కూటమి అభ్యర్థిని ఉద్దేశించి అన్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ కేవలం ఎన్నికలకు మాత్రమే తెనాలి వస్తుండే వారితో ఈ ప్రాంత అభివృద్ధి జరగదని స్పష్టంగా చెప్పారు. గతంలో ఒకే రంగు జెండాతో కనిపించే నాదెండ్ల మనోహర్, ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ మూడు ముక్కలుగా కుట్టించుకుని వేసుకుంటున్నారని చెప్పారు. ఇది అవకాశవాద రాజకీయమని వ్యాఖ్యానించారు. తాను మాత్రం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఒకే పార్టీ, ఒకే జెండాతో ప్రజలకు గరిష్టంగా సంక్షేమాన్ని అందించానని శివకుమార్ చెప్పారు. రానున్న రోజుల్లో బార్ అసోసియేషన్ హాలు నిర్మాణానికి, న్యాయవాదుల కాలనీ ఏర్పాటుకు సహకరిస్తానని ఎమ్మెల్యే శివకుమార్ హామీనిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి న్యాయవాదులు ముందుండి నడవాలని సూచించారు. తెనాలి లీగల్ సెల్ అధ్యక్షుడు కేఎం విల్సన్ పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షుడు జీడీ భగవాన్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు ఆరెమండ రామిరెడ్డి, ఎస్‌బీ శివ, తాడిబోయిన బుచ్చిరాజు, గుమ్మడి రవిరాజ్, గువ్వల పద్మావతి, తాడిబోయిన శ్యామల, సయ్యద్ గౌహర్‌జాన్ మాట్లాడారు. సభలో తెనాలి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించిన బేతాళ ప్రభాకర్‌ను, కార్యవర్గసభ్యులు వేజండ్ల జగజ్జీవన్‌రామ్, తలతోటి సుధాకర్, కొమ్ము అబ్రహాం లింకన్‌ను ఎమ్మెల్యే శివకుమార్ సత్కరించారు.

యువకుడిపై పోక్సో కేసు

సత్తెనపల్లి: విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణ సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. స్థానిక 4వ వార్డుకు చెందిన ఓ బాలుడు ఐదో తరగతి విద్యనభ్యసిస్తున్నాడు. అయితే ఈ నెల 17న చెక్క పనిచేసే నానిపోగు నాగరాజు ఆ విద్యార్థిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కళా రంగానికి వైకే సేవలు చిరస్మరణీయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

నగరంపాలెం: కళా రంగానికి వై.కే నాగేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువ కళావాహిని ఆధ్వర్యంలో యువ కళావాహిని వ్యవస్థాపక అధ్యక్షులు, స్వర్గీయ వై.కే నాగేశ్వరరావు మూడో వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాత్రి బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై ఐదుగురికి వై.కే నాగేశ్వరరావు స్మారక పుర స్కారాలను అందించారు. సంస్థ అధ్యక్షుడు కళా వాచస్పతి లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సంస్థ నిర్వాహకులను ముఖ్య అతిథి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి అభినందించారు. అతిథులుగా విచ్చేసిన అదనపు జిల్లా జడ్జిలు ఆర్.శరత్ బాబు, కె.సీతారామకృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య, కార్యదర్శి బుర్రా ఉమామహేశ్వరరావులు ప్రసంగించారు. అనంతరం భాస్కర శర్మ (సుమధుర ప్రధాన కార్యదర్శి), అమృతవర్షిణి (ప్రముఖ నటి, దర్శకురాలు), చెరుకూరి సాంబశివరావు (ప్రముఖ దర్శకులు, నటుడు), కొల్లా వెంకటేశ్వరరావు (ఆలాపన అధ్యక్షుడు), పి.రంగనాయకులు (ప్రముఖ రంగస్థల నటుడు)కు పురస్కార అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం వి.భాగ్యశశిధర్ దర్శకత్వంలో మాడభూషి దివాకర్‌బాబు రచించిన (యంగ్ థియేటర్ ఆర్గనైజషన్- విజయవాడ) వన్ ప్లస్ వన్ నాటిక ప్రదర్శన సందేశాత్మకంగా కొనసాగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జి.మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు బొప్పన నరసింహారావు, ఎంఏ హమీద్, డి.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం

ఎస్ఆర్ఎం అంతర్జాతీయ సదస్సులో వక్తల అభిప్రాయం

మంగళగిరి : ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని, ప్రజల హక్కులను, బాధ్యతలను మీఅడియా గుర్తు చేస్తుందని ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో గురు, శుక్ర వారాల్లో భారత్‌లో ఆధునిక మీడియా-ప్రజా సంబంధాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల చర్చా గోష్టిలో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు పేరున్న పలు యూనివర్సిటీల సీనియర్ ప్రొఫెసర్లు, ప్రసార మాధ్యమ నిపుణులు,, పాత్రికేయులు హాజరయ్యారు. ప్రధానంగా మీడియా వ్యవహారాలు, ప్రజలతో మీడియాకు ఉన్న సంబంధాలు, ఆధునిక మీడియా పాత్ర, మీడియాలో ఉపయోగిస్తున్న భాష వంటి అంశాలపై వక్తలు సమగ్రంగా చర్చించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. హాజరైన విద్యార్థులు ,ప్రొఫెసర్లు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్‌కుమార్, రూబెర్స్ యూనివర్సిటీ (యూఎస్ఏ) అసోసియేట్ ప్రొఫెసర్ మెహెలీ సేన్, న్యూస్ లాండ్రి సంస్థ సహ వ్యవస్థాపకులు అభినందన్ సేక్రి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ ప్రమోద్ నాయర్, క్రియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గుండిమెడ సాంబయ్య, అజియ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రొఫెసర్, జర్నలిస్ట్ అనురాధ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు భారీ స్క్రీన్‌పై ఐపీఎల్ మ్యాచ్‌లు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రికెట్‌ను ప్రోత్సహించడంతో పాటు ప్రజలకు వినోదాన్ని పంచే ఉద్దేశ్యంతో బీసీసీఐ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని బీసీసీఐ ఆపరేషన్స్ మేనేజర్ అల్విన్ గైక్వాడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం స్థానిక బ్రాడీపేటలోని ఎల్ఈఎం స్కూల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్-సన్ రైజర్స్ హైదరాబాద్‌ను ఉచితంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. దీంతోపాటు ఆదివారం మధ్యాహ్నం కోల్‌కొత్తా నైట్ రైడర్స్-రోయల్ చాలెంజర్స్ బెంగుళూరు, సాయంత్రం పంజాబ్ కింగ్స్-గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్‌ను కూడా భారీ స్క్రీన్‌పై వీక్షించవచ్చని తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎస్‌పీవి రమణ మూర్తి మాట్లాడుతూ గత 8 సంవత్సరాల నుంచి పట్టణంలో భారీ స్క్రీన్‌పై మ్యాచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో బీసీసిఐ పాత్ర ఎంతో కీలకమన్నారు. స్టేడియంలో నేరుగా చూసే అనుభూతి కలుగుతుందన్నారు. మ్యాచ్‌ల వీక్షణానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు వేరు వేరుగా సీటింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం అల్విన్ గైక్వాడ్, రమణమూర్తి, అసోసియేషన్ సభ్యులు అన్నంరాజు సాయిరామ్, రామశర్మలు టాటా ఐపిఎల్ ప్రత్యేక బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు.

సీఎం జగన్ సమక్షంలో

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు


సీఎం సమక్షంలో పార్టీలో చేరిన మొండిబండ సంఘం నేత కృష్ణ


సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన మేకల మాధవ్‌యాదవ్

పట్నంబజారు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీకి చెందిన పలువురు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా కాకినాడ జిల్లా రాజానగరం నియోజకవర్గం ఎస్‌టీ రాజపురం నైట్ స్టే పాయింట్ వద్ద 18వ రోజు బస్సు యాత్రలో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన టీడీపీ మాజీ కార్పొరేటర్ షేక్ సైదా, మొండిబండ సంఘం జిల్లా అధ్యక్షుడు పి. కృష్ణ, టీడీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు మేకల మాధవ్‌యాదవ్ వైఎస్సార్ సీపీలో చేరారు. వారితో పాటు వారి ముఖ్య అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సీఎం వైఎస్ జగన్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

విట్‌లో ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి పరీక్షలు


విఐటీ ఏపీలో ప్రవేశ పరీక్షలు పరిశీలిస్తున్న వీసీ కోటారెడ్డి

తాడికొండ: వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్‌లో విఐటి ఈఈఈ-2024 (ప్రవేశ పరీక్షలు) శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 19 నుంచి 30 వరకు వెల్లూరు, చెన్నై, అమరావతి (ఆంధ్రప్రదేశ్), భోపాల్ క్యాంపస్‌లలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీటెక్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ కోసం ప్రతి ఏటా కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారని, దేశ వ్యాప్తంగా 125 నగరాలు, విదేశాలలోని 6 నగరాలలోని పరీక్షా కేంద్రాల నుంచి విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. ఫలితాలు మే 3 న తమ వెబ్‌సైట్‌లో ఉంటాయని వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వీ కోటారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మూడు స్లాట్లలో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం విజయవాడ, గుంటూరు నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి తెలిపారు.

ఇద్దరు యువకుల దుర్మరణం

- ఒకరికి తీవ్రగాయాలు
- ఒక వాహనాన్ని తప్పించబోయి మరో వాహనాన్ని ఢీకొట్టి
- నల్లపాడులో ఘోర రోడ్డు ప్రమాదం


షేక్ సిద్దిక్ మృతదేహం


ఖలీద్ మృతదేహం

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒక వాహనాన్ని తప్పించబోయి మరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందగా, మరొకరికి గాయాల పాలైన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదపలకలూరు గ్రామానికి చెందిన షేక్ సిద్దిక్ (18) తాపీ పనులు చేస్తుంటాడు. అదేవిధంగా అతని స్నేహితులు ఖలీద్ (17) ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశాడు. బాషా పదో తరగతి పరీక్షలు రాశాడు. వీరు ముగ్గురు కలిసి పల్సర్ వాహనంపై పెదపలకలూరు నుంచి గుజ్జనగుండ్ల వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో జేఎల్ఈ సినిమా హాలు వద్ద పెట్రోలు అయిపోయి నడుపుకుంటూ వెళుతున్న స్కూటర్‌ను ఢీకొన్నారు. అనంతరం అదే వేగంతో ముందుకు వెళుతూ ఎదురుగా వెళుతున్న ఆటోను, కారును ఢీకొన్నారు. ప్రమాదంలో సిద్దిక్ అక్కడికక్కడే మృతిచెందగా, ఖలీద్ తీవ్రగాయాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ అసువులు బాశాడు. బాషా తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు, క్షతగాత్రుడు ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమారులు విగతజీవులు కావడాన్ని చూసి కన్నవాళ్లు బోరున విలపించారు.



నుజ్జు నుజ్జయిన ద్విచక్రవాహనం, ఆటో

తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ ఆస్తులు

రూ.3,74,71,681 కోట్లు

తాడికొండ: గుంటూరు జిల్లా తాడికొండ తెలుగు దేశం పార్టీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ ఆస్తులు రూ. 3,74,71,681 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపరిచారు. తెనాలి శ్రావణ్ కుమార్ పేరిట స్థిర, చరాస్తులు రూ.1,75,53,285, కాగా ఎలాంటి అప్పులు లేవు, ఆయన సతీమణి మాధవీలత పేరిట రూ.9,58,1249 కోట్లు కాగా బ్యాంకు రుణాలు, అప్పుల రూపంలో రూ.2,79,412 చూపించారు. కుమార్తె అపూర్వ పేరిట రూ.58,,69,670 ఆస్తులు చూపించగా ఎలాంటి అప్పులు లేవు, కుమారుడు అనురాగ్ పేరిట రూ. 44,67,507 ఆస్తులు చూపించగా రూ.20 లక్షల బ్యాంకు రుణాలు, అప్పులు చూపించారు. అధికారికంగా ప్రభుత్వ మార్కెట్ వ్యాల్యూ ప్రకారం ఉన్న ఆస్తులే దాదాపు రూ.4 కోట్లుగా చూపించడం విశేషం.


గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య నామినేషన్ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తున్న శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు


గుంటూరు ఎంపి అభ్యర్థి కిలారి రోశయ్యను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు


నామినేషన్‌కు ర్యాలీగా బయలుదేరిన గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య

రౌడీషీటర్లపై నిఘా ఉంచాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలో ఏర్పాటు చేసిన బందోబస్తుపై విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ఆర్‌ఓ కార్యాలయాల వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులకు రక్షణగా వచ్చే ఆయుధాలు కలిగిన పీఎస్‌ఓలను కూడా ఆర్‌ఓ కార్యాలయంలోకి అనుమతించరాదని కోరారు.